వసతుల కల్పనలో ఆర్‌టిసి అధికారులు విఫలం

- బస్టాండ్ తనిఖీలో సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్

ప్రజాశక్తి మదనపల్లె అర్బన్

ఆర్‌టిసి బస్టాండ్‌లో మౌలిక వసతులు చాలా అధ్వానంగా ఉన్నాయని సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మున్సిపల్ కమిషనర్ ప్రమీల, ఇతర శాఖ అధికారులతో కలిసి మదనపల్లె ఆర్‌టిసి బస్టాండ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మరుగుదొడ్లను పరిశీలించిన సబ్ కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. ఇంత అధ్వానంగా ఎలా పెట్టారని ఆర్‌టిసి డిఎం అమర్నాథ్‌ను ప్రశ్నించారు. ముఖ్యంగా దుకాణాదారులు విక్రయించే వస్తువుల చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేయడం, అధిక ధరలకు వస్తువులు విక్రయించడం తగదన్నారు. ఆర్‌టిసి బస్టాండ్ ప్రాంగణం చాలా పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. మరుగుదొడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయని వాటిని వెంటనే పర్యవేక్షించి శుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా కుర్చీలు శుభ్రంగా ఉండాలని, ఏఏ సమయాలకు ఏఏ బస్సులు వస్తాయనే వివరాలను ఎప్పటికప్పుడు తెలపాలని సూచించారు. ఏదైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని ఆర్‌టిసి అధికారులను ఆదేశించారు. సబ్ కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్‌టిసి అధికారులు ఉన్నారు.

జోనల్ మాస్టర్ ప్లాన్‌కు

పటిష్టమైన నివేదికలు రూపొందించాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లా పరిధిలోకి వచ్చే శ్రీ పెనుశిల లక్ష్మి నరసింహ అభయారణ్యం, శ్రీ వెంకటేశ్వర నేషనల్ పార్క్ ప్రాంతాల ఎకో సెన్సిటివ్ జోన్‌కు సంబంధించి రూపొందించనున్న జోనల్ మాస్టర్ ప్లాన్ కోసం వారంలోగా పటిష్టమైన నివేదికలను రూపొందించి సమర్పించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో సబ్ డిఎఫ్ఒ ఆధ్వర్యంలో జిల్లా పరిధిలోకి వచ్చే శ్రీపెనుశిల లక్ష్మి నరసింహ అభయారణ్యం, శ్రీవెంకటేశ్వర నేషనల్ పార్క్ ప్రాంతాల ఎకో సెన్సిటివ్ జోన్‌కు సంబంధించి రూపొందించాల్సిన జోనల్ మాస్టర్ ప్లాన్ అంశంపై కలెక్టర్ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని రాజంపేట, చిట్వేలు మండలాల పరిధిలో 185.42 చదరపు కిలోమీటర్ల మేర శ్రీ పెనుశిల లక్ష్మి నరసింహ అభయారణ్యం, ఓబులవారిపల్లి, రైల్వేకోడూరు, చిట్వేలు మండలాల పరిధిలో 87.02 చదరపు కిలోమీటర్ల మేర శ్రీ వెంకటేశ్వర నేషనల్ పార్క్ విస్తరించి ఉందన్నారు. పర్యావరణ హిత సున్నితమైన ఈ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ రూపొందిస్తోందని పేర్కొన్నారు. గుర్తించిన ఎకో సెన్సిటివ్ జోన్ ప్రాంతాలలో నిషేధించవలసిన, ప్రమోట్, రెగ్యులేట్ చేయాల్సిన అంశాలలో జోనల్ మాస్టర్ ప్లాన్‌లో పొందుపరచడానికి వారంలోగా ఆయా శాఖలు తప్పనిసరిగా నివేదికలు సమర్పించాలని పేర్కొన్నారు. ఇందుకు సుప్రీంకోర్టు, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను దృష్టిలో ఉంచుకోవాలని పేర్కొన్నారు. సబ్ డిఎఫ్ఒ సుబ్బరాజు మాట్లాడుతూ ఆయా శాఖలు సమర్పించే నివేదికలన్నింటిని క్రోడీకరించి జిల్లా పరిధిలోకి వచ్చే ఈ రెండు ప్రాంతాల్లో వన్యప్రాణుల చట్టబద్ధత యొక్క ఎకో సెన్సిటివ్ జోనల్ మాస్టర్ ప్లాన్‌ను నెలలోపు పటిష్టంగా పూర్తి చేసే విధంగా కృషి చేయాలని మాస్టర్ ప్లాన్ కన్సల్టెంట్ సంస్థ ప్రతినిధులను కోరారు. అంతకు ముందుగా ఈ జోనల్ మాస్టర్ ప్లాన్ తయారు చేస్తున్న సెంటర్ ఫర్ ఎన్విరాన్మెంట్ అండ్ డెవలప్మెంట్ హైదరాబాద్ సంస్థ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ కె.జయచంద్ర జోనల్ మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు సంబంధించి ఆయా శాఖలు దృష్టి సారించాల్సిన అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రీయ విద్య కోసం ఉద్యమించాలి

- మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రమణ్యం

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రమణ్యం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మానవత విలువలను పెంపొందించే విద్యావ్యవస్థ కావాలని, శాస్త్రీయ విద్య కోసం ఉద్యమించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని మాజీ ఎమ్మెల్సీ, శాసనమండలి ప్రొటెం స్పీకర్ బాల సుబ్రమణ్యం అన్నారు. స్థానిక విశ్వం విద్యా సంస్థల వద్ద ఐదవ రోజు జరుగుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక శిక్షణా తరగతులకు ముఖ్య అతిథిగా బాలసుబ్రమణ్యం హాజర య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, సామాజిక, సాంస్కృతిక పరిణామానికి ప్రధాన వాహిక, ప్రతి తల్లీ, తండ్రీ తమ బిడ్డలు విద్యావంతులు కావాలని, తమ కంటే మెరుగ్గా బతకాలని ఆశిస్తారన్నారు. జీవన వ్యవస్థలను విద్య పరిపుష్టం చేస్తుందని, దేశ, రాష్ట్రాల ఆర్థిక జీవనాన్ని మెరుగు పరుస్తుందని తెలిపారు. ప్రపంచ దేశాల్లో విద్యావంతులందరూ ఆయా దేశాల అభివృద్ధికి, జీవన వ్యవస్థల పునరుజ్జీవనానికి కృషి చేశారన్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చే క్రమంలోను, వచ్చాక విద్యాభ్యాసానికి సంబంధించి ఒక సంస్కరణగా, ఒక విప్లవంగా విద్యా విప్లవం నడిచిందని గుర్తు చేశారు. దేశ వ్యాప్తంగా విద్యా వ్యాపారం పెరిగిందని, విద్యా విధానం జ్ఞాన సంబంధమైనదిగా ఉండాలే తప్ప, విద్యలో వ్యాపార ధోరణి ఉండకూడదని వివరించారు. ప్రస్తుతం భారతదేశంలో గాని, ఆంధ్ర రాష్ట్రంలో కానీ ప్రభుత్వ పాఠశాలల్లో దళిత, గిరిజన, బిసిల పిల్లలు, అగ్రకులాల్లోని పేదలు చదువుతున్నారనేది నిష్టూర సత్యమన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలు ఎక్కువగా చదువుతున్నారని, 10వ తరగతి పరీక్షల్లో నాలుగు లక్షల మంది ప్రభుత్వ బడుల్లో పాసయితే వారందరూ ఇంటర్ మీడియట్ వరకు చదివే ప్రయత్నం చేయడం లేదన్నారు. విద్య బజారులో అమ్మే సరుకులాగ మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ ప్రైవేటు విద్యకు ప్రోత్సాహం అందిస్తూ ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తోందని విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ విద్యా పరిరక్షణకు దేశంలో, రాష్ట్రంలో మేధావుల్ని, తల్లిదండ్రులను, విద్యావేత్తలను కలుపుకొని పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎ.ప్రసన్నకుమార్, ఎ.అశోక్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.నరసింహ, డి.రమణ పాల్గొన్నారు.

కోళ్లబైలు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ సస్పెన్షన్

- విధి నిర్వహణలో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవు : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

మదనపల్లి మండలం కోళ్ల బైలు-1 గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న డి.ద్వారకనాథ్ నాయుడు లంచం తీసుకొని మోసం చేసినందుకుగాను కలెక్టర్ శ్రీధర్ చామకూరి సదరు వెల్ఫేర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేశారు. మదనపల్లి మండలం కోళ్ల బైలు-1 గ్రామ పంచాయతీ సచివాల యంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా (గతంలో వాల్మీకిపురం మండలం కుర్పర్తి సచివాలయంలో పనిచేసిన) పనిచేస్తున్న డి.ద్వారకనాథ్ నాయుడు, వాల్మీకిపురం మండలం కుర్పర్తి గ్రామానికి చెందిన రెడ్డప్ప, హరీష్‌లకు ప్రధానమంత్రి యోజన పథకం కింద రూ.6 లక్షల రుణం మంజూరు చేయిస్తానని, రూ.30 వేలు వారిద్దరి దగ్గర నుండి తీసుకొని, రూ.49 వేలు ఫోన్ పే ద్వారా వారి దగ్గర నుండి తీసుకొని ఫేక్ ఐడి కార్డులను, నకిలీ రుణ మంజూరు లేఖలను చూపించి వారిని మోసం చేసినట్లుగా ఏప్రిల్ 28న జరిగిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో రెడ్డప్ప, హరీష్ జిల్లా కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. కలెక్టర్ శ్రీధర్ చామకూరి వెంటనే స్పందించి వారు పెట్టుకున్న అర్జీపై పూర్తిస్థాయి నివేదికను అందజేయాలని మదనపల్లి ఎంపిడిఒను ఆదేశించారు. రెడ్డప్ప, హరీష్ అర్జీలో పేర్కొన్న విధంగా సదరు వెల్ఫేర్ అసిస్టెంట్ మోసం చేసినట్లుగా నిర్ధారణ చేస్తూ ఎంపిడిఒ ఇచ్చిన ప్రాథమిక నివేదిక ఆధారంగా వెల్ఫేర్ అసిస్టెంట్‌ను కలెక్టర్ సస్పెండ్ చేశారు. ఎంపిడిఒను తగిన చర్యలు తీసుకొని నివేదికను జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారికి పంపాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. సదరు ఉద్యోగి సర్వీస్ రిజిస్టర్‌లో సస్పెన్షన్‌ను నమోదు చేయాలని మదనపల్లి మండల సహాయ సాంఘిక సంక్షేమ అధికారిని ఆదేశించారు. ముందస్తు అనుమతి లేనిదే డి.ద్వారకనాథ్ నాయుడు, గ్రామాన్ని విడిచి వెళ్లరాదని ఆ ఆదేశాలలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

దళితులపై దమనకాండ కనిపించలేదా..?

- కళ్లకు గంతలతో విసికె నేతల వినూత్న నిరసన

కళ్లకు గంతలతో నిరసన వ్యక్తం చేస్తున్న విసికె నేతలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

దళితులపై యధేచ్ఛగా కొనసాగుతున్న దమనకాండ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు కనిపించడం లేదా..? అంటూ విడుదలై చిరుతైగల్ కట్చి (విసికె పార్టీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. దళితులపై దాడులను ఖండిస్తూ, బుధవారం బాస్ కార్యాలయంలో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. సాక్షాత్తు డిప్యూటీ ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోని మల్లాంలో నెల రోజులుగా దళితుల పట్ల సాంఘిక బహిష్కరణ కొనసాగుతున్నా, దీనిపై ఇప్పటికీ పవన్ కళ్యాణ్ స్పందించక పోవడం కుల వివక్షకు సంకేతం కాదా..? అని ప్రశ్నించారు. విశాఖపట్నం సమీపంలోని ఆక్సిజన్ కాలనీలో అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించి ఎత్తుకెళ్లిపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఇప్పటికీ రిలే దీక్షలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రకాశం జిల్లా కొండేపి నియోజకవర్గంలోని కె.బిట్రగుంటలో అంబేద్కర్ జయంతి ఊరేగింపును ఆధిపత్య కులాల వాళ్లు అడ్డుకున్నారు. సినీ హీరో మోహన్ బాబుకు చెందిన యూనివర్సిటీలో బిటెక్ చదువుతున్న విద్యార్థి జేమ్స్‌ను కిడ్నాప్ చేసి తీసుకెళ్లి, తిరుపతిలోని ఒక లాడ్జిలో ఒకటిన్నర రోజు చిత్రహింసలు పెట్టి, మొహంపై మూత్రం పోశారని తెలిపారు. ఇలాంటివి అనేకం జరుగుతున్నా, కూటమి ప్రభుత్వం ఒక్క సంఘటన మీద కూడా స్పందించక పోవడం దారుణమన్నారు. గరగపర్రు దళితుల వెలివేతను ప్రపంచానికి తెలియజేసిన యాకోబు, ఆ తర్వాత అనుమానాస్పదంగా మరణించారని, అదే తరహాలో పిఠాపురం నియోజకవర్గంలోని మల్లాం దళితుల సాంఘిక బహిష్కరణ వెలుగులోకి తెచ్చిన సుబ్రహ్మణ్యం కూడా అనుమానాస్పదంగా మృతి చెందారని, వీటిపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై జరుగుతున్న హింసపై సిఎం తీవ్రంగా స్పందించి, మహానాడు వేదికగా దాడుల నివారణకు ప్రత్యేక చర్యలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. దళితులపై దాడులు నివారించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే, దళితుల నుండి తీవ్ర ప్రతిఘటన తప్పదని శివప్రసాద్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భారతీయ అంబేద్కర్ సేన (బాస్) జిల్లా ప్రధాన కార్యదర్శి చాట్ల బయన్న, విసికె పార్టీ నాయకులు పెద్దపాలెం రవిశంకర్, బురుజు రెడ్డిప్రసాద్, గంపల రమణ, వై.గంగాధర్, జి.బాబు, జి.గంగాధర్ పాల్గొన్నారు.

అభివృద్ధి దార్శనికుడు రాజీవ్ గాంధీ : కాంగ్రెస్

రాజీవ్ గాంధీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అతిపిన్న వయసులోనే భారతదేశ ప్రధానమంత్రి పదవిని అధిష్టించి, దేశ భవిష్యత్తుకు, అభివృద్ధికి కీలక నిర్ణయాలను స్వాగతించిన అభివృద్ధి దార్శనికుడు స్వర్గీయ రాజీవ్ గాంధీ అని మదనపల్లె నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్.రెడ్డి సాహెబ్ అన్నారు. బుధవారం రెడ్డీ సాహెబ్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ 34 వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం బెంగళూరు బస్టాండు ఇందిరా గాంధీ విగ్రహం వద్ద రాజీవ్ గాంధీ చిత్రపటంపై పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా ఎస్.రెడ్డి సాహెబ్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశ భవిష్యత్తుకు నాడు నాటిన అభివృద్ధి మొక్కలు నేడు వృక్షాలై ఫలాలు అందిస్తున్నాయన్నారు. దూరదృష్టితో సైన్స్ అండ్ టెక్నాలజీ, ఆర్థిక వ్యవస్థను సరళీకృతం చేయడం, పరిశ్రమలకు రాయితీలు, పంచాయతీ రాజ్ వ్యవస్థ పటిష్ఠత వంటి ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారన్నారు. 21వ శతాబ్దిలో దేశాన్ని నూతన పథంలో నడిపించేలా దిశానిర్దేశం చేశారన్నారు. 1984లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో రాజీవ్ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ రికార్డు స్థాయిలో 414 స్థానాలతో గెలిచిందన్నారు. దేశాభివృద్ధికి ఎన్నో సంస్కరణలను తీసుకొచ్చిన రాజీవ్ గాంధీ 1991, మే 21 రాత్రి శ్రీపెరంబదూర్‌లో ఎన్నికల ప్రచారంలో ఉండగా ఎల్‌టిటిఇ తీవ్రవాదులు మానవబాంబు ప్రయోగించి హత్య చేశారన్నారు. దేశం కోసం రాజీవ్ గాంధీ ఉగ్రదాడిలో బలి కావడంతో మే 21ని జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవంగా కేంద్రం ప్రకటించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు మీనాకుమారి, డాక్టర్ ఎస్.కె.బాషా, ముబారక్ ఖాన్, ఖాదర్ బాషా, నాగరాజు, మహబూబ్ పీర్, ఈశ్వరమ్మ, ఖాసిం వలి, శరత్ కుమార్‌రెడ్డి, ద్వారకనాథ్‌రెడ్డి, షాజహాన్ బాషా, రవీంద్ర, అల్లాబక్షు పాల్గొన్నారు.

శ్రీజ డెయిరీ నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

పాల ఉత్పత్తులపై మహిళలకు శిక్షణ

ప్రజాశక్తి-మదనపల్లె

జైకా ప్రాజెక్ట్ సహకారంతో శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విసిజి, ఎంఆర్‌జి మహిళా సభ్యుల శిక్షణ అవగాహన కార్యక్రమం పెంచుపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెంచుపాడు పాల శీతలీకరణ ప్రాంతం ఏరియా మేనేజర్ పెద్దపాళ్యం కృష్ణప్ప మాట్లాడుతూ శ్రీజ ప్రపంచంలో మహిళల పాల ఉత్పత్తిదారుల కోసం ఏర్పాటైన అపూర్వమైన సంస్థ అని పేర్కొన్నారు. బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ నుండి చైర్మన్ వరకు అన్ని స్థాయిలలో మహిళా పాల ఉత్పత్తిదారులే ఉండటం ప్రత్యేకతగా పేర్కొన్నారు. 10 సంవత్సరాలుగా శ్రీజ గ్రామస్థాయిలో 7 లక్షల లీటర్లకు పైగా పాలను సేకరిస్తూ ప్రాసెసింగ్ అనంతరం మదర్ డెయిరీ సహకారంతో మార్కెట్‌కు అందిస్తున్నదని వివరించారు. విసిజి, ఎంఆర్‌జి మహిళా సభ్యుల ఎంపిక, విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. విసిజి సభ్యులుగా గ్రామంలో అత్యధికంగా పాలు సరఫరా చేస్తున్న మహిళల్ని రెండు సంవత్సరాల పదవీకాలంతో ఎన్నుకుంటారని తెలిపారు. ఏడో తరగతి చదివిన మహిళా సభ్యులను ఎంఆర్‌జిలో ఎంపిక చేసి ఒక సంవత్సర కాలానికి మండల స్థాయి శిక్షణకు పంపుతారని చెప్పారు. పాలు, పాల నాణ్యత పెంపు కోసం శ్రీజ క్యాటిల్ ఫీడ్, మినరల్ మిక్చర్ వాడాలన్న సూచనను ఇచ్చారు. అనంతరం ఏరియా పిఐబి ఎం.శంకర్ మాట్లాడుతూ విసిజి, ఎంఆర్‌జి సభ్యులు శ్రీజ డెయిరీకి గ్రామస్థాయి సభ్యులకు మధ్య వారధిగా పనిచేస్తారని తెలిపారు. డెయిరీలో జరిగే విషయాలను వారికి వివరించడమేకాక, వారి సమస్యలను సంబంధిత సిబ్బందికి తెలియజేయడం వారి బాధ్యత అని వివరించారు. ఈ శిక్షణలో పాల్గొన్న సుమారు 53 మంది మహిళా సభ్యులకు జైకా సంస్థ సహకారంతో శ్రీజ మిల్టన్ వాటర్ బాటిల్, ఆవుల పొదువాపు నివారణ కోసం సాఫ్ కిట్, స్ప్రే గన్, హార్లిక్స్ ఉమెన్స్ ప్లస్ వంటి ఉచిత కిట్‌లను అందజేశారు. శిక్షణలో పాల్గొన్న మహిళా యజమానులు శ్రీజ, జైకా సంస్థలకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా సూపర్వైజర్ చలపతి, పలువురు పాలమిత్రులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు

ప్రజాశక్తి-రామపురం

మండలంలో గల ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ రామకృష్ణుడు పేర్కొన్నారు. మండలంలోని 0 నుంచి 18 సంవత్సరాలు వయసు గల ప్రత్యేక అవసరాల గల పిల్లలను గుర్తించి వారికి ప్రభుత్వం కల్పించే అన్ని సదుపాయాలను వివరించి కల్పించినట్లు తెలిపారు. విభిన్న ప్రతిభావంతులైన పిల్లల కోసం మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. భవిత కేంద్రంలో ప్రతి బుధవారం ప్రత్యేక అవసరాల పిల్లలకు కావలసిన ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. విభిన్న ప్రతిభావంతులైన పిల్లలను భవిత కేంద్రానికి పంపించాలని పిల్లలు తల్లిదండ్రులను కోరారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు వారి అంగ వైకల్యం ను బట్టి రూ. 6 వేలు, రూ. 10 వేలు రూ. 5 వేలు ప్రతి నేల సహాయం ప్రభుత్వం ఏర్పాటు చేస్తూ, అలవెన్స్‌ల రూపంలో తోడ్పాటు ఇస్తుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఐఇఆర్‌టి జమలులఖాన్, వరలక్ష్మి పాల్గొన్నారు.

కళాజాతా బృందాలతో ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లె

ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆదేశాల మేరకు, అన్నమయ్య జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మదనపల్లె టమోటా మార్కెట్ వద్ద బుధవారం హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కళాబృందమైన కె.సి.నటరాజ్ కళాబృందం జానపద గీతాలు, నాటికల రూపంలో ప్రజల్లో చైతన్యం నింపే ప్రయత్నం చేసింది. హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాపించే మార్గాలు, వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం వారి ద్వారా ఉచితంగా లభించే ఎఆర్‌టి మందుల వినియోగం అవసరం, ఎయిడ్స్ బాధితుల పట్ల సమాజం వివక్షత చూపకూడదని ఈ సందర్భంగా వివరించారు. జిల్లాలో ఎయిడ్స్ నివారణ, నియంత్రణలో భాగంగా కళాజాత బృందాలు ఈ నెల 31వ తేదీ వరకు వివిధ ప్రదేశాలలో కళాజాత బృందం హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధి పైన, రక్తదానం సుఖవ్యాధులపై వీధి నాటకాలు ద్వారా ప్రజలకు అవగాహన నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 1097 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా సమాచారం పొందవచ్చని సూచించారు. కార్యక్రమానికి స్థానిక జనచేతన ప్రాజెక్టు మేనేజర్ ఓబులేసు, మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రి ఎఆర్‌డి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మేఘన, స్థానిక ఆర్ఆర్ఎస్ సభ్యులు, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు, ఆరోగ్య సూపర్వైజర్లు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

రక్తదానం చేస్తున్న ఆడపిల్ల తండ్రి కేశవ్

ఆడపిల్ల పుట్టిందని రక్తదానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: ఆడపిల్ల పుట్టిందన్న ఆనందం ఆ తల్లిదండ్రుల్లో పెల్లుబికింది. ఆ సంతోషంలో తల్లిదండ్రులు రక్తదానం, అన్నదానం చేసి తమ సంతోషాన్ని పలువురితో పంచుకున్నారు. హెల్పింగ్ మైండ్స్ సభ్యుడైన కేశవ్, పావని దంపతులకు మే 18న మదనపల్లె జిల్లా ఆసుపత్రిలో పుట్టిందని ఆనందం వ్యక్తం చేస్తూ హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ అవుతూనే బుధవారం మదనపల్లె ఆర్టీసీ బస్టాండులో అన్నార్తుల ఆకలి తీర్చేందుకు ఫుడ్ బ్యాంక్‌లో ఆహారం పెట్టాడు. మదనపల్లె వాలంటరీ బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచాడు కేశవ్. ఈ సందరేగా హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబకర్ సిద్దిక్ హర్షం వ్యక్తం చేస్తూ తమ సంస్థ సభ్యుడు ఇంతటి ఆదర్శనీయమైన కార్యక్రమం చేసినందుకు అభినందనలు తెలియజేశాడు. ఆడపిల్ల పుట్టగానే రక్తదానం, అన్నదాన వితరణ చేసిన మొట్టమొదటి జంటగా తమ సంస్థ సభ్యుడు కేశవ్ అవ్వడం చాలా గర్వంగా ఉందన్నారు. కేశవ్ దంపతుల స్ఫూర్తితో ఆడపిల్లల పుడితే ప్రతి ఒక్కరూ గర్వంగా ఉండాలని పిలుపునిచ్చారు.

మాట్లాడుతున్న విజయ భాస్కర్

కూటమి ప్రభుత్వంలో సామాన్యుడికి తప్పనితిప్పలు

- వైసిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి విజయ భాస్కర్

ప్రజాశక్తి-రాయచోటి

జగనన్న తీసుకొచ్చిన గడప వద్దకే రేషన్ పంపిణీకి మంగళం ఇక రేషన్ షాపుల వద్ద మళ్లీ క్యూలైన్లు దర్శనమని కూటమి ప్రభుత్వంలో సామాన్యుడికి తప్పని తిప్పలు అని వైసిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి సిబ్యాల విజయ భాస్కర్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా వైసిపి కార్యాలయంలో కౌన్సిలర్ ఈశ్వర్ ప్రసాద్, గువ్వల బుజ్జిబాబు తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా విజయభాస్కర్ మాట్లాడుతూ రేషన్ డెలివరీ వాహనాలు తీసేస్తే ఎంత ఇబ్బందో ఒక్కసారి కూటమి ప్రభుత్వం ఆలోచించాలన్నారు. గ్రామానికి 10 నుంచి 15 పల్లెలు అన్నింటికీ ఒక్కరే డీలర్ ఆయా పల్లెలు అందరు కలిసి వెళ్లి రేషన్ తెచ్చుకోవడం సాధ్యం కాదన్నారు. రేషన్ డీలర్ పనికిపోకుండా ఇంటి దగ్గర ఉండాలి లబ్ధిదారుడు పనులు మానుకొని కిలోమీటర్, నుండి ఐదు ఆరు కిలోమీటర్లు నడుచుకొని వెళ్ళాలి అన్నారు. ఈ నిర్ణయం వల్ల రూ.20 రేషన్ కోసం రూ.200 నుంచి రూ.300 ఖర్చు పెట్టుకుని ఆటోలో వెళ్లి రేషన్ తెచ్చుకోవాలిన్నారు.రేషన్ డెలివరీ వాహనాలు రద్దు చేయడం మంచిది కాదన్నారు.

మినీ మహానాడును విజయవంతం చేయండి

- ఎమ్మెల్యే షాజహాన్ బాషా

ప్రజాశక్తి-మదనపల్లె

రాష్ట్రంలో అత్యంత ఘనంగా నిర్వహించబడే తెలుగుదేశం పార్టీ మహాసభలు మహానాడు సన్నాహకంగా నిర్వహించే మినీ మహానాడు వేడుకలకు ఏర్పాట్లు మదనపల్లిలో ఊపందుకున్నాయి. గురువారం మదనపల్లి పట్టణంలోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో ఈ వేడుకలు వైభవంగా జరగనున్న నేపథ్యంలో, మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా పార్టీ కార్యకర్తలు, అభిమానులు, తెలుగుదేశం కుటుంబ సభ్యులందరిని పెద్ద ఎత్తున తరలివచ్చి వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. కడపలో నిర్వహించనున్న మహానాడు కార్యక్రమాలను జయప్రదంగా జరిపేందుకు మదనపల్లి నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు తరలివెళ్లేలా ఏర్పాట్లపై మినీ మహానాడు కార్యక్రమంలో చర్చించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. గురువారం జరగనున్న ఈ వేడుకలకు ప్రతి ఒక్కరు హాజరై టిడిపి పండుగను ఘనవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

'ఆదిత్య' ప్రొఫెసర్ వీరేష్‌బాబుకు డాక్టరేట్

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లెలోని ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో అసోసి యేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఎం.వీరేష్ బాబుకు, చిదంబరంలోని అన్నామలై విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్, టెక్నాలజీ ఫ్యాకల్టీ ద్వారా 'స్మార్ట్ హెల్త్‌కేర్ మానిటరింగ్ సిస్టమ్స్'లో పరిశోధనకు పిహెచ్‌డి డిగ్రీ ప్రదానం చేసింది. మే 19న తుది డిసర్టేషన్ విజయ వంతంగా పూర్తికావడం ద్వారా ఈ ఘనతను ఆయన సాధించారు. ఆధునిక ఆరోగ్య సంరక్షణకు సాంకేతిక పరిష్కారం 'ఎంబెడెడ్ లాట్‌తో పునరావాసం కోసం రూపొందించిన స్మార్ట్ హెల్త్‌కేర్ మానిటరింగ్ సిస్టమ్' అనే థీసిస్ ఆధారంగా ఈ డాక్టరేట్ లభించింది. ఇది శస్త్రచికిత్స అనంతర రోగుల పునరావాసానికి సాంకేతికత ఆధారిత పరిష్కారాలను పరిశీలిస్తూ, ఆసుపత్రి వెలుపల రోగుల ఆరోగ్యాన్ని సమర్థవంతంగా పర్యవేక్షించే విధానాన్ని ప్రతిపాదించింది. ప్రొఫెసర్ డాక్టర్ వి.రమ్య మార్గదర్శకత్వంలో ఆయన రూపొందించిన లాట్ ఆధారిత ఫ్రేమ్‌వర్క్ రియల్ టైమ్ పేషెంట్ మానిటరింగ్‌కు, పునరావాస సమయంలో ఆరోగ్య పారామితుల విశ్లేషణకు అనుకూలంగా ఉంటుంది. హృదయ స్పందన రేటు, ఆక్సిజన్ లెవల్స్, రక్తపోటు, శరీర ఉష్ణోగ్రత వంటి కీలక డేటాను సేకరిం చేందుకు ధరించగలిగే సెన్సార్‌లను వినియోగించారు. ఆదర్శంగా నిలుస్తున్న పరిశోధన ఈ స్మార్ట్ వ్యవస్థ స్ట్రోక్, ఆర్థోపెడిక్, హృదయ సంబంధిత చికిత్సల అనంతరం రోగుల నిరంతర పర్యవేక్షణకు మార్గదర్శిగా నిలుస్తోంది. పీడన గుర్తింపు, హెచ్చరిక వ్యవస్థలు, మొబైల్ అప్లికేషన్ ద్వారా రోగి, సంరక్షకుడు, వైద్యుల మధ్య సమన్వయాన్ని కల్పించే విధంగా రూపకల్పన చేశారు.డాక్టర్ వీరేష్ బాబు విజయాన్ని పురస్కరించుకుని ఆదిత్య కాలేజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఆర్.రామ మోహన్‌రెడ్డి, అధ్యక్షుడు ఎం.నాగమల్లరెడ్డి, డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగరెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్ బాబు పాల్గొని అభినందనలు తెలియజేశారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

భోజన వసతి ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-రామాపురం

కడపనగర శివారులో ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించబోయే మహానాడుకు చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుంచి, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి తరలి వస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానుల తరలి వస్తారని వారి కోసం భోజన వసతులను ఏర్పాటు చేస్తున్నట్లు లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మద్దిరేవుల రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని గువ్వలచెరువు పక్కన గల స్థలంలో భోజనాలు, వాహనాల పార్కింగ్ కావలసిన స్థలాన్ని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశాల పరిశీలించినట్లు తెలిపారు. మండలంలోని గువ్వలచెరువు సమీపంలో ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో సరస్వతిపల్లె సర్పంచ్ మునీర్‌బాషా, అన్నయ్య సహదేవరెడ్డి కదిరప్పనాయుడు, హజామ్, జాఫర్‌వల్లి పాల్గొన్నారు.

బోనాలు తీసుకెళుతున్న మహిళలు

వైభవంగా గంగమ్మ జాతర

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

నియోజకవర్గ కేంద్రం తంబళ్లపల్లె వారపు సంత తోపులో శ్రీ కోటకొండ గంగమ్మ ఆలయంలో వైభవంగా జాతరను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సతీమణి కవితమ్మ స్వగృహం నుంచి ధీలు, బోనాలు అమ్మవారికి పసుపు, కుం కుమ, వస్త్రాలు గాజులు మేళ తాళాలతో మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకు వచ్చారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు తీర్చు కున్నారు. నియోజ కవర్గంలో వర్షాలు పుష్కలంగా పడి ప్రతి కుటుంబ ఆయూ రారోగ్యాలతో ఉండాలని అన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల పార్టీ కన్వీ నర్ చౌడేశ్వర్, వైస్ ఎంపిపి కరీం, జిల్లా అధి కార ప్రతినిధి జయసింహారెడ్డి, జిల్లా మహిళా నాయకురాలు జ్యోతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పనుల్లో పురోగతి సాధించాలి : ఎస్ఇ

ప్రజాశక్తి - కడప

ఆర్‌డిడిఎస్ పథకం కింద పనులు చాలా నెమ్మదిగా సాగుతున్నాయని, పనుల్లో పురోగతి సాధించాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ అన్నారు. కడప విద్యుత్ భవన్‌లో ఆర్‌డిడిఎస్ పథకం కింద జరుగుతున్న పనులపై తన ఛాంబర్‌లో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌డిడిఎస్ పథకం ద్వారా గ్రామీణ ప్రాం తాలలో త్రీఫేస్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని తెలియజేశారు. ఈ పనుల ద్వారా గ్రామీణ ప్రాంతాలలో పరిశ్రమల ఏర్పాటుకు మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా నిరంతర నాణ్యమైన త్రీఫేస్ విద్యుత్ ఏర్పడి సులభతరం అవుతుందని తద్వారా పట్టణాలకు దీటుగా గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని తెలియజేశారు. పనులలో వేగవంతం పెంచాలని తద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు త్వరగా లబ్ధి చేకూరాటమే కాకుండా విద్యుత్ వ్యవస్థ పటిష్టవంతంగా తయారవుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగరాజు, డిఇఇలు, ఎఇలు, గుత్తేదారులు పాల్గొన్నారు.

ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

విభిన్న ప్రతిభావంతులు వారికి అందించిన ప్రత్యేక ఉపకారణాలను సద్వినియోగం చేసుకోవాలని జోన్ 4 పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు శామ్యూల్ సూచించారు. బుధవారం సమగ్ర శిక్ష కార్యాలయ ఆవరణలో ఉపకారణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అలింకో ఉపకరణాలను తయారు చేసి అందిస్తోందని తెలిపారు. వీటిని సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో అర్హులను గుర్తించి అందిస్తుందని చెప్పారు. ప్రభుత్వం విభిన్న ప్రతిభావంఉలకు అందించిన ఉపకారణాలను సద్వినియోగం అయ్యేలా వారి తల్లిదండ్రులు, ప్రత్యేక ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో- ఆర్డినేటర్ నిత్యనంద రాజులు, విభిన్న ప్రతిభవంతుల శాఖ జిల్లా సంచాలకులు కృష్ణ కిషోర్లు మాట్లాడుతూ ఉపకారణాలు విభిన్న ప్రతిభావంతులు తమ లోపాలను అధిగమించి పురోగమించడానికి అవకాశం కల్పిస్తాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌జెడి కార్యాలయ ఎడి విజయ కుమార్, సమగ్ర కో - ఆర్డినేటర్ రమణమూర్తి, కేశవరెడ్డి, విశ్వనాథరెడ్డి, వీరేంద్ర, ఐఇఆర్‌పిలు మమత, విజయమ్మ, పద్మ, గంగులప్ప, చంద్ర, రాజా పాల్గొని అర్హులకు వీల్ చైర్స్, సిపి చైర్స్, రోలేటర్స్ అందించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉపవైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖాజా మొద్దీన్ అన్నారు. బుధవారం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ స్నేహ ప్రత్యూష, డాక్టర్ శాంత కుమార్, సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్యతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు పడుతున్నాయి, కాబట్టి నీరు నిల్వలు ఉండే అవకాశం ఉందని, దానివల్ల దోమలు వృద్ధి చెంది జ్వరాలొస్తాయని పేర్కొన్నారు. ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు అందరూ జాగ్రత్తగా ఉండి ఫీవర్, లార్వా సర్వేలు నిర్వహించి ఎక్కడైనా జ్వరాలు వచ్చినట్లయితే తమకు, సబ్ యూనిట్ ఆఫీసర్‌కు వైద్య సిబ్బంది తెలపాల న్నారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి జ్వరం వచ్చిన వారిని దగ్గరిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చి రక్తపరీక్షలు చేయించి వ్యాధి నిర్ధారణ అయిన తర్వాత చికిత్స చేయాలన్నారు.

ఎండియు వాహనాలను కొనసాగించాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రజలకు రేషన్ బియ్యాన్ని ఇంటి వద్దకు అందజేస్తున్న ఎండియు వాహనాలను కొనసాగించాలని తహశీల్దార్ నాగేశ్వరావును ఆపరేటర్లు కోరారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఎండియు ఆపరేటర్లు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు 2027 వరకు గత ప్రభుత్వం వాహనాలను రేషన్ కార్డుదారులకు ఇంటి వద్దకు బియ్యం ఇచ్చేలా అనుమతి ఇచ్చిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తమను తొలగించాలని కేబినెట్ నిర్ణయం తీసుకోవడం సరైంది కాదన్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని విన్నవించారు. కార్యక్రమంలో మండలంలోని 8 మంది ఎండియు ఆపరేటర్లు పాల్గొన్నారు.

నేడు బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-దువ్వూరు : హనుమజ్జయంతి పురస్కరించుకుని గురువారం మూడు వందలు బైకులతో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు అరవేటి హరికృష్ణ, అమ్మిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడంతో సంఘీభావంగా సుమారు 300 వందల బైకులతో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా పాల్గొనాలని పేర్కొన్నారు.

యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం : కలెక్టర్

రాయచోటి : యోగాసనం వేస్తున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

శారీరక, మానసిక ఆరోగ్యం, భావోద్వేగాల సమతుల్యతలు యోగాతోనే సాధ్యమని కలెక్టర్ శ్రీధర్‌చామకూరి పేర్కొన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని బుధవారం ఉదయం రాయచోటిలోని మునిసిపల్ పార్కులో నిర్వహించబడిన కర్టెన్ రైజర్ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 21, 2025న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించబడు తోందని అన్నారు. జిల్లాలో జూన్ 21 వరకు జిల్లా వ్యాప్తంగా యోగ కార్యక్రమాలు నిర్వహించబడతాయని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా నిర్వహించబడే కార్యక్రమాలలో అన్ని వయసులకు చెందిన పౌరులందరూ పాల్గొనే విధంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్య క్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** శారీరక, మానసిక ప్రశాంతతకు యోగ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. యోగాంధ్ర-2025 కార్యక్రమాన్ని బుధవారం వివిధ శాఖ అధికారులతో కలిసి సబ్‌కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ యోగాస నాలను వేశారు. అనంతరం సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ శారీరక, మానసిక, ఆధ్యాత్మిక, శ్రేయ స్సుకు యోగ ఎంతో దోహద పడుతుందన్నారు. శరీర పటుత్వానికి, మనసు ఏకాగ్రతకు యోగాసనాలు వేయాలన్నారు. విశాఖపట్నం రామకృష్ణ బీచ్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోడీ పర్యవేక్షణలో జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని డివిజన్ కేంద్రంలో నెల రోజుల పాటు యోగాంధ్ర-2025 పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు యోగాను ఆచరించాలని, తద్వారా మెదడు పటుత్వం పెరిగి ఆలోచన శక్తి పెరుగుదలతో పాటు ఎంతో ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారులు, సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, మదనపల్లె పుర ప్రజలు పాల్గొన్నారు. **నిమ్మనపల్లి :** యోగ తోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి, తహశీల్దార్ అమ ర్నాథ్ అన్నారు. జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా డే ని పురస్క రించుకొని ప్రభుత్వ ఆదేశం మేరకు నెల రోజులపాటు ప్రతి ప్రభుత్వ కార్యాల యంలో వివిధ రకాలుగా యోగా ఆసనాలను నిర్వహించే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో రెవెన్యూ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు కలసి మొదటిరోజు యోగ ఆసనాలను చేయడం జరిగిందన్నారు. అంతర్జాతీయ యోగాడే సందర్భంగా ర్యాలీ నిర్వహించి న్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ మిథున్‌చక్రవర్తి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. **వాల్మీకిపురం :** యోగాతో మానసిక ఉల్లాసం లభిస్తుందని వాల్మీకిపురం ఎంపి డిఒ మనోహర రాజు అన్నారు. బుధవారం స్థానిక పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో యోగాంధ్ర 2025 కార్యక్రమం నిర్వచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుం దన్నారు. నిత్యం యోగా చేయడం వలన ఆత్మ విశ్వాసంతో పాటు మానసిక ఉల్లాసం, ఉత్సాహం లభిస్తుంద న్నారు. కార్యక్రమంలో ఇఒ వీరబల్లి రవీంద్రనాథ్, ఇఒఆర్ డి.సుధాకర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ చక్రపాణి, ఎపిఒ సునీల్ పాల్గొన్నారు. **సుండుపల్లి:** యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం లభిస్తుందని ఎంపిడిఒ సుధాకర్‌రెడ్డి పేర్కొ న్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఉదయం 7గం టలకు ఉద్యోగులకు యోగ కార్యక్రమాన్ని నిర్వహించారు. జూన్ 21న అంత ర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ దైవాదీనం, ఎంఇఒ రవీంద్ర నాయక్, విస్తరణ అధికారి, మాస్టర్ ట్రైనర్ రాధారాణి, రవీంద్ర, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **కలకడ :** జూన్ 21న నిర్వహించబోయే అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మండలస్థాయి అధికారులు స్థానిక జడ్‌పి హైస్కూల్(తెలుగు) నుంచి ఎంపి డిఒ కార్యాలయం, పోలీసుస్టేషన్ మీదుగా బాటవారిపల్లి జడ్‌పి హైస్కూల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సచివాలయం సిబ్బందిచే యోగాసనాలు వేశారు. యోగా చేయడం వల్ల మనసు ఉల్లాసంగా, ఉత్తేజంగా ఉంటుందని అన్నారు. ప్రతి ఒక్కరూ యోగతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పంచా యతీ కార్యదర్శి దేవేంద్ర, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నిమ్మనపల్లి : యోగాసనం వేస్తున్న అధికారులు, సిబ్బంది

టిబి క్యాంపెయిన్‌ను సద్వినియోగం చేసుకోండి

-డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ రమేష్‌బాబు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

వంద రోజుల టిబి వ్యాధి క్యాంపెయిన్‌ను సద్వినియోగం చేసుకుందామని మదనపల్లి డివిజన్ డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ రమేష్ బాబు పేర్కొన్నారు. మండల కేంద్రం లోని పిహెచ్‌సిలో ఎఎన్ఎం, ఆశా కార్యాకర్తలకు వందరోజుల క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో టిబిని మూడు పద్ధతుల ద్వారా నియంత్రణ చేయాలని మొదటిది అనుమానిత టి.బి లక్షణా లు గలవారిని, ఆరు వర్గాలకు చెందిన వారిని బిఎంఐ 18కంటే తక్కువ ఉన్నవారు, షుగర్ పేషెంట్స్, స్మోకర్స్, ఆల్కహాల్ సేవించువారు, గర్భిణులు గతంలో ఐదు సంవత్సరాల క్రితం టిబి వచ్చి బాగైనవారిని గుర్తించాలన్నారు. రెండవ పద్ధతిలో వీరందరికి గళ్ళ పరీక్షలు చేయాలని, మూడవ పద్ధతిలో గళ్ళ పరీక్షలో పాజిటివ్ వచ్చిన వారికి చికిత్స ప్రారం భించాలన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్‌రఫీ మాట్లాడుతూ బిఎంఐను ఎలా లెక్కకట్టాలో అందులోని వర్గాలపై అవగాహన కల్పించారు. టిబి పర్య వేక్షకులు నాగిరెడ్డి మాట్లాడుతూ టిబి వ్యాధి చికిత్సలో ఉన్న రోగుల సంబంధీకులకు కూడా సైటిబి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పాజిటివ్ వస్తే వారికి కూడా ప్రొఫైల్లక్సిస్ కింద మూడు నెలలు చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. సిబ్బంది అందరికి చేత టిబి. ఆరోగ్య సాతి యాప్‌ను డౌన్లోడ్ చేయించి ఎలా వాడు కోవాలో వివరించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ ఇందిరాదేవి, పర్యవేక్షకులు సరోజ, దేవేంద్ర, దేవకుమారి ఎఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ రమేష్

గజ్జలవారిపల్లిలో పడకేసిన పారిశుధ్యం

- రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరు
- ఆస్పత్రుల పాలవుతున్న ప్రజలు
- పట్టని అధికారులు

రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తుండటంతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ప్రజాశక్తి-రామసముద్రం

మండలంలోని కాప్పల్లి పంచాయతీ గజ్జలవారిపల్లి గ్రామంలో పారిశుధ్యం పడకే సింది. మండల పరిధిలోని డ్రెయినేజీ సమస్య తీర్చాలని ప్రజలు ఆరు నెలలుగా సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం శూన్యం. తూతుమంత్రంగా పరిశీలిస్తున్నారే తప్పా కార్యాచరణ మాత్రం చేయలేదు. దుర్వాసన, దుర్గంధంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దోమలుస్వైర విహారం చేయడంతో రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తుండ టంతో రాకపోకలు సాగించేం దుకు ఇబ్బందిగా ఉందని వాహన దారులు చెబుతున్నారు. పారిశుధ్య లోపాలు కంటికి కొట్టొచ్చి నట్లు కనపడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. మూడు నెలలుగా నివాసాల మధ్య మురుగు కాలువలు శుభ్రం చేసిన దాఖలాలు కనబడలేదు. కొట్టొచ్చిన అపరిశుభ్రత, మురు గునీటి కాలు వలతో నిండి, దుర్గంధం వెదజల్లుతున్నా పంచాయతీ కార్యదర్శులు చూసి చూడ నట్లు వ్యహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. దుర్గంధంతో కనీసం తిండికూడా తినలేక పోతు న్నామని కనీసం బ్లీచింగ్ అయినా చల్లించాలని ప్రజలు వేడుకుంటున్నారు. డ్రెయినేజీ కాలువలు శుభ్రపరచక పోవడంతో సమీపంలో ఉన్న ఇళ్లలోని జనాలు దోమకాట్ల బారినపడి ఆస్పత్రుల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుర్వాసనను భరించలేక పోతున్నామని అన్నారు. మలేరియా, డెంగీ, టైపాయిడ్ వంటి విషజ్వరాల బారిన పడుతున్నామని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రెయినేజీ కాలువలు శుభ్రం చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

కుటుంబ ప్రతిష్టను దిగజార్చడం ఎవరికీ సాధ్యంకాదు

- టిడిపి సీనియర్ నాయకులు లక్ష్మీరెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

తమ కుటుంబ ప్రతిష్టను దిగజార్చడం ఎవరికీ సాధ్యం కాదని టిడిపి సీనియర్ నాయకులు, జడ్‌పి మాజీ వైస్ చైర్మన్ అలంఖాన్‌పల్లి లక్ష్మీరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక వైఎస్ఆర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప నియోజకవర్గ టిడిపి మినీ మహానాడు కార్యక్రమంలో తమ నకిలీ ఆడియో, వీడియో సృష్టించి వైసిపి అనుకూలంగా ప్రచారం చేశారని కార్యకర్తలకు వినిపించడంవిడ్డూరంగా ఉందని అన్నారు. 1996 నుంచి 2025వరకు తెలుగుదేశం పార్టీకి అంకితభావంతో పనిచేశామని అన్నారు. 30 సంవత్స రాల నుంచి అలంఖాన్‌పల్లిలో ఓటమి లేకుండా గెలిచామన్నారు. టిడిపిని ఓడించాలని వీరోచితంగాను, అన్ని శక్తులను ఉపయోగించి మమ్మల్ని అణగదొక్కాలని చూశారని అన్నారు. పార్టీ కార్యకర్తలు, మా కుటుంబ కష్టం వలన, టిడిపి అండదండల వల్ల ఓటమి అనేది లేకుండా గెలుపొందామన్నారు. ఇప్పుడు వచ్చిన కడప ఎమ్మెల్యే మాధవి, శ్రీనివా సరెడ్డి లేనిపోని ఆరోపణలు మాపై సృష్టించి ప్రజల్లో , కార్యకర్తలకు మధ్య గందరగోళం సృష్టించి ఏదో లబ్ధి పొందాలని చూడటాన్ని వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు. మేము ఎప్పటికీ పార్టీ విధేయులమేనని అన్నారు. టిడిపి కార్పొరేటర్ ఉమాదేవి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కోసం మా కుటుంబం ఎన్నో కష్టాలను, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నామని అన్నారు. అది . కారికంగానూ ఎంతో అణచివేయబడి, ఎన్నో కేసులను ఎదుర్కొంటున్నామని తెలిపారు. మమ్మల్ని కించపరచడం మీకు ఆనందం అనుకుంటే అది మీ విజ్ఞతకే వదిలేస్తున్నామని చెప్పారు. మహానాడును కడప జిల్లాలో నిర్వహించడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడుకు అందరిని కలుపుకొని పోవాలని కానీ కార్యకర్తలను, ప్రజలను వేరు చేయడం, అక్కడక్కడ దాడులు చేయించడం మంచి పరిణామం కాదని అన్నారు. అధికారాన్ని ఉపయోగించి ప్రజలను అణగదొక్కాలని చూడటం రాక్షస ఆనందమే తప్ప నాయకుల లక్షణం కాదని అన్నారు. ఎమ్మెల్యే మాధవి, వాసు ఇప్పటికైనా నిజాలు తెలుసుకోవాలని, కడపలో తెలుగుదేశం పార్టీకి పనిచేసేది తామేనని, వెనకడుగు వేసే ప్రసక్తే లేదని అన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీరెడ్డి

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పీడీ వెంకటరత్నం

'ఉపాధి' పనులు తనిఖీ చేసిన పీడీ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని కుక్కరాజుపల్లి గ్రామపంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం డ్వామా పీడీ వెంకటరత్నం తనిఖీ చేశారు. గ్రామంలో పర్యటించారు. ఉపాధి పనులను పరిశీలించి కూలీలతో ముఖాముఖి చర్చించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి బిల్లుల త్వరగా చెల్లించాలని కూలీలు కోరగా త్వరగా చెల్లించేందుకు తగు చర్యలు తీసుకుం టామని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎపిఒ అంజ నప్ప, ఇంజినీర్ మహేష్, టెక్నికల్ అసిస్టెంట్ బాలగంగాధర్, ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

ఆర్‌టిసి బస్టాండ్ పరిశీలిస్తున్న అధికారుల బృందం

ఆర్‌టిసి బస్టాండ్ పరిసరాలు పరిశీలన

ప్రజాశక్తి-పీలేరు

పీలేరులో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జలమయమైన ఆర్‌టిసి బస్టాండ్ పరిసరాలను అధికారుల బృందం పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం తహశీల్దారు భీమేశ్వరావు, ఆర్‌టిసి డిఎం నిర్మల, పంచాయితీ అధికారులు బస్టాండ్, మురుగునీటి కాలువలు, మరుగుదొడ్లు, శుద్ధ నీటి కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఆర్‌టిసి బస్టాండ్, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించడం జరిగిందని, పరిశీలనా నివేదికను ఉన్నతాధికారులకు పంపడం జరుగుతుందని చెప్పారు. కార్యక్ర మంలో తహశీల్దార్ వెంట పంచాయతీ సిబ్బంది, ఆర్‌టిసి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి వర్ధంతి

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరులోని స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణంలో సుప్రసిద్ధ కథా రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ప్రముఖ విమర్శకులు, బోధకులు కేతు విశ్వనాథరెడ్డి రెండవ వర్ధంతిని గురువారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, రచయిత బొమ్మిశెట్టి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు వర్ధంతి కార్యక్రమం జరుగుతుందని, తెలుగు భాషాభిమానులు, కవులు, రచయితలు, చరిత్రకారులు, విద్యార్థులు, పుర ప్రజలు పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

మురుగునీటిని తొలగించేందుకు చర్యలు

ప్రజాశక్తి-లింగాల : మండల కేంద్రంలోని దిగువ లింగాల మసీదు వీధిలో మురుగునీరు నిల్వ చేరి వ్యాధులు వ్యాపిస్నున్నాయని, నీటిని తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని లింగాల సర్పంచ్ జూలువకర్, స్థానికులు ఇన్‌ఛార్జి ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శశివర్ణకు బుధవారం విన్నవించారు. ఏడాది నుంచి మసీదు వీధిలో ఆరుబయట నీటిని వదులుతున్నారని, పారబోయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. మేరకు ఆమె బుధవారం సర్పంచ్‌తో కలసి గ్రామంలో పర్యటించారు. ఆరు బయట నీటిని వదులుతున్న వారికి నోటీసులు జారీ చేసినా తీసుకోలేదన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని, మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

విశాఖ ఉక్కు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప : విశాఖపట్నంలో పిసిసి అధ్యక్షురాలు వైఎస్. షర్మిల ఉక్కు కార్మికుల కోసం చేస్తున్న ఆమరణ దీక్షలో డిసిసి అధ్యక్షులు విజయ జ్యోతి పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా విజయ జ్యోతి మాట్లాడుతూ విశాఖ ఉక్కు యాజమాన్యా నిధి నిరంకుశ ధోరణి. డిమాండ్ల సాధనపై కార్మికులు సమ్మె బాట పడుతుంటే కనీసం దిద్దుబాటు చర్యలకు దిక్కులేదు అన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరిం చాలన్న కనికరం కూడా లేదని పేర్కొన్నారు. దిక్కున్న చోట చెప్పుకోండనే తీరున యాజమాన్యం వ్యవహరిస్తోంది అన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ జిల్లా నుంచి ప్రొద్దుటూరు నియోజవర్గం సమన్వయకర్త ఇర్ఫాన్ బాష, జమ్మలమడుగు సమన్వయకర్త శివ మోహన్‌రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ పీర్, క్రిస్టియన్ మైనార్టీ జిల్లా అధ్యక్షులు సంజయ్ కాంత, కార్మిక శాఖ విభాగం జిల్లా ఉపాధ్యక్షులు ఫైరోజ్ బాషా పాల్గొన్నారు

క్రైం కార్నర్

షాపులోకి దూసుకెళ్లిన ఐచర్ వాహనం

ఐచర్ లారీ బీభత్సం

- కారును ఢీకొని షాపులోకి దూసుకెళ్లిన వైనం
- ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

టమోటా లోడుతో వెళ్తున్న ఐచర్ లారీ బీభత్సం సృష్టించి, రోడ్డు పక్కన ఉన్న కారును ఢీకొని ఆ పక్కనే ఉన్న షాపులోకి దూసుకెళ్లింది. ఈ ప్రమా దంలో షాపు వద్ద నిలబడి ఉన్న ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన బుధవారం కురబలకోట మండలంలో చోటుచేసుకుంది. ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె తాలూకా పోలీస స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న గాయత్రి తన భర్తతో కలిసి కోర్టు విధులకు వెళ్లి తిరుగు ప్రయాణమై కురబలకోట మండలం, ముదివేడు సమీపంలోని కడప క్రాస్ వద్ద ఆగి ఉన్నారు. ఈ సమయంలో మదనపల్లె టమోటా మార్కెట్ యార్డు నుంచి టమో టాల లోడుతో కడప వైపు బయలుదేరిన ఐచర్ లారీ ముదివేడు క్రాసులో నిలబెట్టి ఉన్న ఎస్ఐ కారును ఢీకొని, పక్కనే ఉన్న షాపులోకి దూసుకెళ్ళింది. ఈ ప్రమాదంలో షాపు వద్ద నిలబడి ఉన్న ములకలచెరువు మండలం, చవటకుంటపల్లికి చెందిన రెడ్డమ్మ, నారేవారిపల్లెకు చెందిన అరుణమ్మ, కలకడ మండలం పాపిరెడ్డిగారిపల్లి చెందిన వెంకటరమణను ఢీకొంది. ఈ ముగ్గురు తమ బంధువులు ఇళ్ళకు వెళ్లి తిరుగు ప్రయాణం కోసం బస్సు కోసం వేచి ఉండగా ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న ముదివేడు పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి జెసిబి సాయంతో లారీని, అందులోంచి పడిపోయిన టమోటా క్రేట్లను బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన బాధితులను 108 లో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారులో ఉన్న ఎస్ఐ, ఆమె భర్తకు ఎటువంటి గాయాలు కాలేదు. కారు మాత్రం పాక్షికంగా దెబ్బతింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.